క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సభ్యులు

నేరేడుచర్ల: మండలంలోని దిర్శించర్ల గ్రామంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి జొన్నలగడ్డ సైదులు, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, రామకృష్ణ, పుల్లయ్య, సతీష్, వసంతరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్ తదితరులున్నారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

చిలుకూరు: చిలుకూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు తగిన వసతులు కల్పించాలని కోరారు.

గోవులకు పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం తీసుకెళ్తున్న దాతలు వెంకయ్య, వెంకటేశ్వర్లు

గరిడేపల్లి: మండల కేంద్రానికి చెందిన మండాది వెంకయ్య, పెండెం వెంకటేశ్వర్లు సోమవారం మఠంపల్లి మండలం మట్టపల్లిలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఉన్నటువంటి గోవులకు రెండు ట్రాక్టర్ల పశుగ్రాసం అందజేశారు. కార్యక్రమంలో పురోహితులు కొంపెల్లి కృష్ణశాస్త్రి, ఆలయ చైర్మన్ మండాది వెంకటయ్య, ట్రాక్టర్ దాత మండాది మురళి, పుట్ట బక్కయ్య, మండవ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు

కోదాడరూరల్: మండల పరిధిలోని గుడిబండలో ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా వేసిన బోరును సోమవారం పీఏసీఎస్ చైర్మన్ ఓరుంటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అలివేలు మంగమ్మ, ఓరుగంటి రామకృష్ణారెడ్డి, వీరనాగు, షేక్ రఫీ, రాంబాబు, చిన్న వెంకటరాములు, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని వేములూరి వాగు నుంచి సీతారాంపురం గ్రామానికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను(టీఎస్ 29 ఎస్ 5458) సోమవారం శ్రీనివాసపురం గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కి తరలించి డ్రైవర్ తురక సైదులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'ఆలయ కమిటీ నియామకం జరగలేదు'

మునగాల: మండలంలోని మాధవరం గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యుల నియామకం జరగలేదని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎలక సత్తిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కమిటీ నియామకం వాయిదా పడిందని తెలిపారు. గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైనట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కాగా ఆలయ కమిటీ నియామకం జరుగలేదని దేవాదాయ శాఖ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వెంకట శేషాచలపతి కూడా తెలిపారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి

నడిగూడెం: మండల పరిధిలోని అన్ని చెరువులను సాగర్ నీటితో నింపాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ హేమామాలినికి వినతి పత్రం అందజేశారు. చెరువులు, బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటి ప్రజలతో పాటు మూగజీవాలు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు పందిటి నవీన్ కుమార్, కార్యకర్తలు ఉన్నారు.

అనుమతులు లేకుండా మట్టి రవాణా

- చెరువులు, గుట్టలను సైతం వదలని అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

హుజూర్‌నగర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. మట్టికి బాగా డిమాండ్ పెరగడంతో కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చెరువులు, కుంటల్లోని మట్టిని తరలిస్తున్నారు. హుజూర్‌నగర్ మండలంతో పాటు ఇతర ప్రాంతాల్లో మట్టి కొరత ఏర్పడడంతో వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హుజూర్‌నగర్ మండలంలో..

హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా కొందరు అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. కొందరు నాయకులు చెరువులు, కుంటల్లోని మట్టిని జేసీబీల ద్వారా తవ్వి ఇటుక బట్టీలకు, కొందరు వ్యాపారస్తులకు ట్రాక్టర్ మట్టికి రూ.500, టిప్పర్ మట్టికి రూ.1000 వరకు అమ్ముకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల శ్రీనివాసపురం గ్రామం నుంచి టిప్పర్ల ద్వారా చెరువు మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు 7 టిప్పర్లను పట్టుకుని, వాటి యజమానులు, ఇటుక బట్టీల యజమానులపై కేసులు నమోదు చేసినా అక్రమార్కులు భయపడకుండా తిరిగి మట్టి దందా కొనసాగిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారికే అండగా నిలుస్తున్నారే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వేపలసింగారంలోని ఊర చెరువు నుంచి ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు



శ్రీనివాసపురం చెరువు నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

చట్టపరంగా చర్యలు చేపడతాం

వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల శివారులోని చెరువుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీల ద్వారా మట్టిని తవ్వి తరలిస్తున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. అనుమతులు లేకుండా చెరువు, కుంటల్లో మట్టిని తవ్వి అక్రమంగా తరలించే వాహనాలను గుర్తించడంతో పాటు వాటి యజమానులపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ, హుజూర్‌నగర్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



శానిటైజర్ బాటిళ్లను అందజేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగిని

నేరేడుచర్ల: నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగిని పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ జీవన శైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మంచి అలవాట్లతో వ్యాధుల నుంచి బయటపడవచ్చన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందిబండ శ్రీనివాస్ రూ.800 విలువైన శానిటైజర్ బాటిళ్లను వైద్యాధికారి నాగినికి అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు రామస్వామి, సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, సైదులు, శ్రీనివాస్ తదితరులున్నారు.

చెరువు మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల్లో రైతుల పేరుతో చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తే తగిన చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ డీఈ బిక్షం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లోని చెరువుల మట్టిని రైతుల పేరుతో దళారులు అక్రమంగా తరలించి పెద్ద మొత్తంలో ప్రభుత్వ వనరులను దోచుకుంటున్న విషయం, చెరువు శిఖం నందే మట్టిని పోసి చెరువుని ఆక్రమించడం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా పెద్ద మొత్తంలో మట్టిని దళారులు ఇటుక బట్టీలకు విక్రయిస్తూ నీటిపారుదల శాఖ అనుమతితోనే జరుగుతున్నట్లుగా ప్రచారం చేయడాన్ని ఖండించారు. రెండు మండలాల పరిధిలో మట్టి తోలుటకు నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ చేయలేదని పేర్కొన్నారు. అక్రమ రవాణాకు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని కోరుతూ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానయ్య మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రిజిస్టర్ పోస్టుల ద్వారా వినతులు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబురావు, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొట్టముక్కల రాములు, మాజీ వార్డు సభ్యులు తుమ్మకొమ్మ యోనా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న రోడ్డు పనులు



కంకర తేలిన కోదాడ-సింగారం రోడ్డు



బీటీ రోడ్డుగా మారిన కోదాడ -సింగారం రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: సాక్షి దినపత్రిలో ప్రచురితమైన 'కంకర పరిచి.. పనులు మరిచి' కథనానికి అధికారులు స్పందించారు. వివరాలు.. కోదాడ పట్టణంలోని జాతీయ రహదారి నుంచి రామిరెడ్డిపాలెం మీదుగా వాయిల సింగారం వరకు 6.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో దాన్ని పునర్నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. రూ.2.20 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రోడ్డును పూర్తిగా తవ్వి దానిపై కంకర, డస్ట్ కలిపి ఒక లేయర్‌గా వేశాడు. ఇక అక్కడి నుంచి పనులు చేయకుండా వదిలేశాడు. దీనిపై సాక్షి దినపత్రికలో మార్చి 23న ప్రచురితమైన కథనాన్ని చూసిన కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి వెంటనే పనులు ప్రారంభించకపోతే సదరు కాంట్రాక్టర్‌ను తొలగించి మరొకరికి పనులు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ దిగి వచ్చాడు. వారం రోజులుగా రోడ్డు పనులు ముమ్మరంగా చేస్తున్నాడు. బీటీ రోడ్డు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్.. మరో కిలోమీటరు మేర సీసీ రోడ్డును రెండు మూడు రోజుల్లో పూర్తిచేస్తానని చెబుతున్నాడు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



లబ్ధిదారుకి ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జ్యోతిలక్ష్మి

నేరేడుచర్ల: మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన దాసరి సైదులు ఇటీవల మృతిచెందారు. ఆయన ప్రధానమంత్రి సురక్ష బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం చెల్లిస్తుండడంతో నామినీగా ఉన్న ఆయన భార్య దాసరి రామనర్సమ్మకు సోమవారం నేరేడుచర్ల పట్టణంలోని ఎస్‌బీఐలో రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జ్యోతిలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి సురక్ష బీమా పథకం ద్వారా ప్రతి ఏడాది కేవలం రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద బీమా పొందవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఫణికుమార్, సిబ్బంది నర్సింహులు, అంజిరెడ్డి, శివప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

హుజూర్‌నగర్: మండల పరిధిలోని గోవిందపురం గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. వివరాలు.. గోవిందపురం గ్రామానికి చెందిన దేవిశెట్టి నరేష్ ఇతర రైతుల వద్ద గడ్డి కొనుగోలు చేసి తనకు సంబంధించిన స్థలంలో గడ్డివాము వేశాడు. ప్రమాదవశాత్తు ఆ గడ్డివాము సోమవారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే గడ్డివాము దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

షార్ట్ సర్క్యూట్‌తో..

మఠంపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధమైంది. మఠంపల్లి మండల పరిధిలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యాతవాకిళ్ల గ్రామానికి చెందిన బైరి శ్రీను తన పొలం వద్ద నుంచి ట్రాక్టర్‌లో వరిగడ్డిని ఇంటికి తీసుకోస్తున్నాడు. గ్రామంలోని ప్రధాన వీధిలో ట్రాక్టర్ ట్రక్కుకు విద్యుత్ తీగలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. దీంతో ట్రక్కులో ఉన్న గడ్డి పూర్తిగా దగ్ధమైంది. స్థానికంగా ఉన్న ట్యాంకర్‌ను తీసుకువచ్చి గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు. కాగా రూ.10 వేల విలువ గల వరిగడ్డి దగ్ధమైందని బాధిత రైతు వాపోయాడు.



హుజూర్‌నగర్: మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఎండలేని సమయాల్లో కూలి పనులకు వెళ్లాలి

కోదాడరూరల్: ఉపాధి హామీ కూలీలు ఉదయం 10గంటల లోపు సాయంత్రం 4గంటల తర్వాత పనికి వెళ్లాలని కాపుగల్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూచించారు. సోమవారం మండలంలోని గణపవరంలో జరగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. కూలీలు పనికి వెళ్లేటపుడు తాగునీటిని తప్పకుండా తీసుకెళ్లాలని, ప్రభుత్వం అందజేస్తున్న ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తాగుతుండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, పద్మ, ఆశ కార్యకర్తలు ఉష, నాగమణి ఉన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి..

అనంతగిరి: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. సోమవారం అనంతగిరి మండల పరిధిలోని పాలారంలో వడదెబ్బపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, విజయ్, కృష్ణమూర్తి, ఏఎన్‌ఎంలు శ్రీదేవి, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



అనంతగిరి: పాలవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మోతె: ఉపాధి పనుల కల్పన, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు హెచ్చరించారు. సోమవారం మోతె మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో ఉపాధి సిబ్బందికి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో ఉపాధి కూలీలకు 100శాతం పనులు కల్పించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ శిరీష, ఎంపీడీఓ హరిసింగ్, తహసీల్దార్ సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పనులు ప్రారంభం

నేరేడుచర్ల: మండల పరిధిలోని పుల్లంబండతండా ప్రాథమిక పాఠశాలలో అమ్మ-ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా నీటి సరఫరా పనులను ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, గ్రామ కార్యదర్శి ఇంజమూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా

మునగాల: మండలంలోని కొక్కిరేణి గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండు నెలలుగా తాగునీరు దొరక్క, తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వేసవి కారణంగా బోర్లు, బావులు ఎండిపోయాయన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నప్పటికీ గ్రామంలో తాగునీరు అందడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఖాళీ బిందెలతో కొక్కిరేణి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, మాజీ ఉప సర్పంచ్ రావులపెంట బ్రహ్మం, నాయకులు నిడిగొండ శంభయ్య, దేవర నర్సయ్య, నందిగామ చినసైదులు, ఇంటూరు హుస్సేన్, రెడ్డిబోయిన శ్రీకాంత్, గడ్డం చినఅంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి



కోతి సంపత్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం

హుజూర్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలు తీర్చడంలో పాలకవర్గం ముందుండాలని విజిలెన్స్ అదనపు ఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర లారీ యజమానుల సంఘం ఉపాధ్యక్షుడు రామినేని శ్రీనివాస్ అన్నారు. హుజూర్‌నగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి ఇటీవల హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందున సోమవారం సంపత్‌రెడ్డి దంపతులను లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్థసారథి లారీ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు లక్ష్మారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సంజీవరెడ్డి, గౌరవ సలహాదారులు గోల శంకర్‌రావు, కార్యదర్శి ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాసరాజు, పాలకవర్గ సభ్యులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణపవరంలో చెరువు శిఖం కబ్జాకు యత్నం

- మట్టిపోసి ఆక్రమించుకుంటున్న అక్రమార్కులు

కోదాడరూరల్: మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గల ఊర చెరువు శిఖాన్ని ఆక్రమించుకునేందుకు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 309లో 110 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంటే ఇప్పటికే దాదాపుగా 40 ఎకరాల మేర ఆక్రమణకు గురైందని తెలిపారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో చెరువును ఆనుకొని ఉన్న కొందరు రైతులు అందులో నీరు లేకపోవడంతో చెరువులోని మట్టిని జేసీబీతో అక్రమంగా తవ్వడమే కాకుండా అదే మట్టితో చెరువు శిఖాన్ని పూడ్చుకుంటూ కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా ప్రతి ఏడాది చెరువు శిఖాన్ని ఆక్రమించుకుంటూ పోతే చెరువు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. చెరువు శిఖమే కాకుండా అందులోకి నీరు వచ్చే పంట కాల్వలను సైతం మట్టిపోసి పూడ్చివేశారని అన్నారు. సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని చెబితే వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులో మట్టిని తవ్వుతున్నన, శిఖాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.



చెరువు శిఖంలో పోసిన మట్టిని చూపుతున్న మత్స్యకారులు

విజేతలకు బహుమతులు ప్రదానం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పట్టణ వాసవీ క్లబ్, వనిత లెజెండ్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం వంగవీటి లోకేశ్వరరావు సహకారంతో విజేతలకు పాఠశాలలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయవాణి దేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాతంగి ప్రభాకర్, క్లబ్ కార్యవర్గ సభ్యులు పి. స్రవంతి, వాణి, సుజాత, వి. వెంకయ్య, వి. నాగేశ్వరరావు, పి. వెంకటేశ్వర్లు, టి. నాగేశ్వరరావు, వి. రామనరేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాత, వాసవీ క్లబ్ సభ్యులు

జాతీయ జెండా ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆశిమ్ కోహ్లి తదితరులు

నడిగూడెం: మండల కేంద్రంలోని రాజావారి కోటలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేసేందుకు సోమవారం రిటైర్డ్ మేజర్ జనరల్ ఆశిమ్ కోహ్లి స్థలాన్ని పరిశీలించారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య సేవలను స్మరించుకుంటూ ఫ్లాగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా 70 అడుగుల జాతీయ జెండాను రాజావారి కోటలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. వారి వెంట సోల్జర్స్ ఫౌండేషన్ చైర్మన్ కల్నల్ సుంకర శ్రీనివాస్, సభ్యులు రాజేష్, డాక్రి డైరెక్టర్ హిమబిందు, చరిత్ర పరిశోధకుడు జితేంద్రబాబు పాల్గొన్నారు.

బైక్ పైనుంచి జారిపడడంతో గాయాలు

మునగాల: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారి యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణానికి చెందిన కొత్తకొండ సాయికృష్ణ, వనపర్తి సాయిరామ్ బైక్‌పై కోదాడ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో మునగాల శివారులోని సాగర్ ఎడమ కాలువ ప్రధాన గేట్ల వద్ద బైక్‌పై వెనుక కూర్చున్న సాయిరామ్ జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108వాహనంలో కోదాడ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన సాయిరామ్



గాయపడిన కార్తీక్

బైక్ అదుపుతప్పడంతో యువకుడికి..

హుజూర్‌నగర్‌రూరల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురం శివారులో సోమవారం జరిగింది. వివరాలు.. వేపలసింగారం గ్రామానికి చెందిన చడపంగు కార్తీక్ గోపాలపురంలోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తుండగా.. గోపాలపురం శివారులో కోదాడ-మిర్యాలగూడ రహదారిలోని సర్వీస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో కార్తీక్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు కార్తీక్‌ను 108వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అతడిని సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రసాయనాలు వాడకుండానే కూరగాయలు సాగుచేయొచ్చు

అనంతగిరి: ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా కూరగాయ పంటలు సాగు చేయవచ్చని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపయ్య అన్నారు. అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో కూరగాయలు సాగుచేస్తున్న రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూరగాయ పంటల సాగులో రోజురోజుకు రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం పెరిగిందని, దీంతో రైతులకు పెట్టుబడి పెరగడంతో పాటు, భూసారం కూడా దెబ్బతింటుందన్నారు. ప్రతి రైతు కూడా ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించవద్దన్నారు. మనకు అందుబాటులో ఉన్న సహజ వనరులతో కూరగాయ పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. నేల సారవంతంగా తయారవ్వాలంటే జీవామృతం, ఘన జీవామృతం, పశువుల పెంట ఉపయోగించాలని, చీడపీడల నివారణకు నీమాస్త్రం, దశపత్ర కషాయం, వేపగింజల కషాయం ఇంకా పలు రకాల ద్రావణాలను ఉపయోగించాలన్నారు. దీంతో నాణ్యమైన పంట దిగుబడులు వస్తాయని, మార్కెట్‌లో కూడా రైతులకు మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు గోవిందు, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటారు, పైపులైన్ దగ్ధం

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో విద్యుత్ మోటారు, స్టార్టర్, పైపులైన్ దగ్ధమయ్యాయి. నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన కుక్కడపు వెంకటేశ్వరరావు మామిడి తోటను సాగు చేస్తున్నాడు. దుండగులు నిప్పంటించడంతో తోటలోని మామిడి చెట్లతో పాటు విద్యుత్ మోటారు, స్టార్టర్, పైపులైన్ దగ్ధమయ్యాయి. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.